www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 జులై 2024

ఎంపిడిఒ కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - నరసాపురం

అదృశ్యమైన నరసాపురం ఎంపిడిఒ వెంకటరమణరావు కుటుంబ సభ్యులను విజయవాడలో సోమవారం నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు కలిశారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. అనంతరం దీనిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.


ఎంపిడిఒ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకర్, రామరాజు

పోటెత్తిన వరద

నరసాపురం వద్ద గోదావరి వరద ఉధృతి

- భారీ వర్షాలతో జిల్లా అతలాకుతలం - గోదావరి, యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం
- మొగల్లు శివారు గోస్తనీకి గండి - గుత్తులవారిపాలెంలో కలెక్టర్ నాగరాణి పర్యటన
- ముంపులో 40 వేల ఎకరాల్లో నాట్లు, 3368 ఎకరాల్లో నారుమళ్లు

ప్రజాశక్తి - భీమవరం

ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. అల్పపీడనం తీరం దాటినప్పటికీ దాని ప్రభావం జిల్లాలో ఇంకా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో ఎర్ర కాలువ, యనమదుర్రు డ్రెయిన్, గోస్తనీ ఉగ్రరూపం దాల్చాయి. ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక, భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా వశిష్ట గోదావరికి కూడా ఒకటో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. యనమదుర్రు డ్రెయిన్ మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహిస్తోంది. ముఖ్యంగా దుర్గాపురం, లంకపేట, మెంటేవారితోట, చేపలమార్కెట్ ప్రాంతాల్లో చేరిన వరద నీరును రెండు రోజులుగా ఆయిల్ ఇంజిన్ల ద్వారా బయటకు తోడే ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో బయటకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. రెండు రోజుల నుంచి స్వచ్ఛంద సేవా సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బాధితులకు భోజన వసతి కల్పిస్తున్నారు. ఎర్రకాలువ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి 10,362 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నందమూరు అక్విడెక్టు నుంచి మరో 20,539 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతోపాటు పరివాహక ప్రాంతాల్లో డ్రెయినేజీల నుంచి 1077 క్యూసెక్కుల నీరు యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తోంది. దువ్వ, చిలకంపాడు, పరిమెళ్ల, ముదునూరు, పిప్పర, కేశవరం, సాగిపాడు, యండగండి, గరగపర్రు ప్రాంతాల్లోని పంట కాల్వల నీరు కూడా యనమదుర్రు డ్రెయిన్‌లో కలుస్తోంది. దీంతో యనమదుర్రు డ్రెయిన్ ఉగ్రరూపం దాల్చింది. గట్టుకు ఇరువైపులా అంచులను తాకుతూ ప్రవాహం సాగుతోంది. మరో నాలుగు అడుగుల నీటిమట్టం పెరిగితే భీమవరం పట్టణానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇక గోదావరి ఉధృతి ధవళేశ్వరం వద్ద గంటగంటకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వశిష్టగోదావరి ఉరకలేస్తోంది. దీంతో దిగువన ఉన్న లంక గ్రామాలకు ముంపు ప్రమాదం పొంచి ఉంది. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే వరద నీటికి మునిగింది. దీంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. కనకాయలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి, బాడవ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నరసాపురంలో గోదావరి ఉధృతిని ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్ పరిశీలించారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఆచంట మండలాల్లో తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేసినట్లు ప్రకటించారు. గోదావరిలో పడవల రాకపోకలు నిషేధించామని, అనధికార పడవలు వెళ్లకుండా అడ్డుకోవాలని మత్స్య శాఖాధికారులను ఆదేశించారు.

మొగల్లు శివార్లలో గోస్తనీకి గండి

పాలకోడేరు మండలం మొగల్లు గ్రామ శివార్లలో గోస్తనీకి వరద నీరు పోటెత్తడంతో ఆదివారం రాత్రి గండిపడింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు, రైతులు రాత్రికి రాత్రే అక్కడికి చేరుకుని మట్టి, ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గుత్తులవారిపాలెం చేరుకుని యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం నాటికి వరద నీరు మరింత చేరుకోవడంతో గుత్తులవారిపాలెం వద్ద ఆయకట్టుతోపాటు వంతెన సమీపాన రోడ్డు అవతలివైపు ఉన్న ఆయకట్టులో సుమారు 600 ఎకరాలు ముంపుబారిన పడ్డాయి. దీంతో అక్కడి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 500 ఇసుక, మట్టి బస్తాలతో గండిని పూడ్చినప్పటికీ పరిస్థితి ఇంకా అదుపులోకి రాలేదు. ప్రస్తుతం తడికలు, కర్రలతో అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గుత్తులవారి పాలెంకి చెర్చి ఉన్న 25 యానాదుల కుటుంబాలు ముంపుబారిన పడ్డాయి. వరద నీరు చుట్టుముట్టడంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఆ కాలనీలో కలెక్టర్ నాగరాణి సోమవారం పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. ప్రతి కుటుంబాన్ని పలకరించి ఆధార్ కార్డులు ఉన్నాయా, రేషన్ అందుతుందా, ఎవరికైనా అనారోగ్యంగా ఉందా అని ఆరా తీశారు. తాగునీటికి ఇబ్బందిగా ఉందని, డ్రెయినేజీ సమస్య ఉందని చెప్పగా వెంటనే తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ శ్రీనివాసులురాజును కలెక్టర్ ఆదేశించారు. వరద తగ్గాక డ్రెయిన్ల సమస్యపై పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు. పాముకాటుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపిడిఒ అనూష్య, ఆర్ఐ నాగభూషణంనాయుడు, ఇతర అధికారులు ఉన్నారు. వరద నీరు మొగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను చుట్టుముట్టింది. కార్యాలయంలోకి వరద నీరు చేరింది. సామగ్రితోపాటు ట్రాన్స్‌ఫార్మర్లను వేరేచోటకు తరలించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి.

సిపిఎం, జనసేన, టిడిపి నేతల పరిశీలన

గోస్తనీ నదికి గండి పడ్డ ప్రాంతాన్ని సిపిఎం, జనసేన, టిడిపి నేతలు సోమవారం పరిశీలించారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు అసిరియ్య, నాయకులు పాలా వెంకటస్వామి గండి పూడ్చే పనుల్లో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిరియ్య మాట్లాడుతూ ప్రతియేటా ప్రమాదం పొంచి ఉందని తెలిసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మొగల్లు శివార్లలో గోస్తనీకి పడిన గండిని పూడ్చే పనులు

ముంపులోనే నారుమళ్లు, నాట్లు

నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ముంపునకు గురైన నారుమడులు, నాట్లు నీటిలోనే నానుతున్నాయి. సాధారణంగా వర్షాలు తగ్గిన వెంటనే పొలాలు ముంపు నుంచి బయటపడేవి. అయితే ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో కాల్వలు, డ్రెయిన్లు పొంగిపొర్లుతుండటంతో పొలాల్లోని నీరు లాగడం లేదు. పొలాల్లోని నీరు లాగాలంటే కనీసం వారం రోజులు పట్టే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో నారు మడులు, నాట్లు కుళ్లిపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 87,660 ఎకరాల్లో వరినాట్లు వేశారు. దీనిలో సుమారు 40 వేల ఎకరాల్లో నాట్లు, 3363 ఎకరాల్లో నారుమళ్లు ముంపుబారిన పడ్డాయి. జిల్లాలో 25 వేల మంది వరకు రైతులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదిలా ఉంటే నష్టం అంచనాలు రూపొందించేందుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలూ రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

గుత్తులవారిపెంటలో కలెక్టర్ నాగరాణి పర్యటన

నిర్మలమ్మ పద్దు పలికేనా..!

- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
- పోలవరానికి నిధుల కేటాయింపుపై ఉత్కంఠ
- పునరావాసానికి నిధులిస్తేనే నిర్వాసితుల కష్టాలు తీరే
- రైల్వేలైన్లకు నిధులు కేటాయించేనా
- వ్యవసాయం, ఆక్వాకు ప్రోత్సాహకాలు ప్రకటిస్తారా
- ఆదాయపు పన్ను ఊరట కోసం వేతన జీవుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యథలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు.. కర్షకుల కన్నీటి వెతలు మోడీ సర్కార్‌కు కన్పిస్తాయా.. మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే కేంద్రబడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించేనా.. అంటూ సర్వత్రా చర్చ సాగుతోంది. జిల్లాలోని రైల్వేలైన్లకు, నిట్, కేంద్రీయ విద్యా సంస్థల అభివృద్ధి వంటి వాటికి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారా.. ఆక్వా, వ్యవసాయ సాగుకు ఊతమిచ్చేలా ప్రకటన ఉంటుందా.. లేదా అనేది నేడు ప్రవేశపెట్టబోయే 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌లో తేలిపోనుంది.

పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై జిల్లా ప్రజానీకం అనేక ఆశలు పెట్టుకుంది. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ఉత్కంఠ కొనసాగుతోంది. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి, జనసేన ముఖ్యభూమిక పోషిస్తున్నాయి. టిడిపి బలంపైనే కేంద్రం మోడీ సర్కార్ నిలబడింది. ఇటువంటి తరుణంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపు ఏవిధంగా ఉంటుందనే చర్చ జనంలో నెలకొంది. జిల్లాలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు బాధ్యత కేంద్రానిదే. ఈ ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నిధులు కేంద్రమే భరించాల్సి ఉంది. గడిచిన పదేళ్లుగా మోడీ సర్కార్ పోలవరానికి నిధుల కేటాయింపులు సక్రమంగా చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. దీంతో పోలవరం నిర్వాసితులకు ఇప్పటి వరకూ పునరావాస ప్యాకేజీ అందించలేదు. ఒకపక్క ప్రాజెక్టులో కీలకమైన కాపర్‌డ్యామ్ నిర్మాణం చేయడంతో ప్రతియేటా జులై, ఆగస్టు నెలల్లో విరుచుకుపడుతున్న గోదావరి వరదలకు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 107 నివాసిత ప్రాంతాలకు చెందిన 20 వేలకుపైగా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతమూ అదే పరిస్థితి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు రూ.52 వేల కోట్లు ఖర్చవుతుందని, నిర్వాసితులకు పరిహారం కింద రూ.33 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. ఇప్పటి వరకూ నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఎనిమిది శాతం కూడా అందించని పరిస్థితి నెలకొంది. బడ్జెట్‌లో పోలవరానికి నిధులు పెద్దఎత్తున కేటాయిస్తేనే నిర్వాసితులకు పరిహారం అందే అవకాశం ఉంటుంది.

రైల్వేలైన్లకు మోక్షం లభించేనా?

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లు ఉన్నాయి. ప్రతియేటా బడ్జెట్‌లో కొవ్వూరు-భద్రాచలం లైన్‌కు నిధుల కేటాయింపు అనేది లేకుండాపోయింది. కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు అరకొర నిధుల కేటాయింపుతో సరిపెడుతున్న పరిస్థితి ఉంది. జిల్లాలోని రైల్వే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారో.. లేదో వేచిచూడాలి.

వేతన జీవుల ఎదురుచూపు.. కేంద్రీయ విద్యాసంస్థలకు నిధులు దక్కేనా

ఏడాదికి రూ.2.50 లక్షలుగా ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా ఊరట లభిస్తుందనే ఆశతో ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని నిట్, కేంద్రీయ విద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తారో లేదో వేచిచూడాలి. జిల్లాలో అతిపెద్ద సాగుగా ఆక్వా ఉంది. సరైన ధరలేక, మేత ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా రైతులకు మేలు చేసేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఏమైనా ఉంటాయా అని ఆక్వారైతులు ఎదురు చూస్తున్నారు. ఎరువులు, పురుగుమందుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగిపోవడంతో వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయాయి. దీంతో సాగు భారంగా మారింది. వ్యవసాయ పంటల మద్దతు ధరకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావిస్తారో.. లేదో చూడాల్సి ఉంది. ఉపాధి హామీకి నిధుల కేటాయింపుపైనా ఉత్కంఠ నెలకొంది. నిర్మలమ్మ పద్దు ఎవరికి మేలు చేకూర్చనుందో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

గోదావరి ఉగ్రరూపం

ఆందోళనలో లంక గ్రామాల ప్రజలు
నీట మునిగిన కనకాయలంక కాజ్‌వే

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ఎగువ నుంచి వరదనీరు వచ్చి చేరుతుండటంతో సోమవారం సాయంత్రం నాటికి కరుగోరుమిల్లు వద్ద 24 గంటల్లో మూడు అడుగుల మేర గోదావరి నీటిమట్టం పెరిగింది. అయితే ఎగువ ప్రాంతం నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తుండటంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మరో నాలుగు అడుగుల మేర నీటిమట్టం పెరిగితే లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశిస్తుంది. ప్రస్తుతం లంక గ్రామస్తులు దైనందిన కార్యక్రమాలు యధావిధిగా సాగిస్తున్నారు. అయితే వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. ఎస్ఐ రాజకుమార్ ఆధ్వర్యాన కోడేరు, పెదమల్లం పుష్కర ఘాట్లు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ ఐపి.శెట్టి లంక గ్రామాల్లో పర్యటించి వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

యలమంచిలి: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గంట గంటకు పెరుగుతున్న వరద ప్రవాహంతో మండలంలో గోదావరి వరద ఉధృతి బాగా పెరిగింది. లంక గ్రామాలైన కనకాయలంక, దొడ్డిపట్ల అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ తదితర గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కనకాయలంక గ్రామానికి వెళ్లే మార్గంలో కాజ్‌వే నీట మునగడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.


నాటు పడవలపై కనకాయలంకవాసుల రాకపోకలు

పెనుగొండ: సిద్ధాంతం వద్ద గోదావరి ఉధృతి

నరసాపురం: నరసాపురం వద్ద వశిష్ట గోదావరి వరద ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ నుండి నీటి విడుదల పెంచడంతో ఇక్కడ వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. పొన్నపల్లి వద్ద వరద నీరు సుడులు తిరుగుతుండటంతో ఆ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అదే ప్రాంతంలో గతంలో ఏటిగట్టు కోతకు గురైన సంగతి తెలిసిందే. ఇక నరసాపురం-సఖినేటిపల్లి నడుమ పంటు రాకపోకలను నిలిపివేసిన సంగతి తెలిసిందే.

ఎరుపెక్కిన సముద్రపు నీరు

గోదావరి వరద ప్రభావంతో బంగాళాఖాతంలో సముద్రపు అలలు ఉధృతంగా వస్తున్నాయి. నరసాపురం నియోజకవర్గంలో పేరుపాలెం, కెపి పాలెం, పెదమైనవానిలంక, చినమైనవానిలంకలో సముద్రపు నీరు ఎరుపెక్కింది.

ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోదావరి ఉధృతిని పరిశీలించి అధికారులకు ఆర్‌డిఒ, జెసి దిశానిర్దేశం

యలమంచిలి: అధికారులతో మాట్లాడుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - నరసాపురం

ఏటిగట్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు, సలహాలు ప్రజలందరూ పాటించాలని నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ అన్నారు. సోమవారం వశిష్ఠ గోదావరి ఉధృతిని పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలను ఆర్‌డిఒ జారీ చేశారు. పొన్నపల్లి 1, 2, 3 వార్డులు పరిశీలించి, అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి ఆర్‌డిఒ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్ష ప్రభావం తగ్గిందని, ఎగువన కురిసిన వర్షాలు వరద రూపంలో మనకు ప్రమాదం వచ్చే అవకాశం ఉన్నందున, తీర ప్రాంతాలను, గోదావరి పరివాహక ప్రాంతాలను అప్రమత్తం చేశామని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, ఆచంట మండలాల్లో తుఫాన్ రక్షిత భవనాలను సిద్ధం చేశామన్నారు. వరద పరిస్థితి మరింత ఎక్కువ అయితే పునరావాస కేంద్రాలకు వచ్చుటకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తీరప్రాంతంలో బోట్స్‌మెన్స్ సొసైటీలను, మత్స్యకారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. వారి పడవలు, వలలు, ఇతర పనిముట్లను భద్రపరుచుకునేలా, ఎవరూ చేపల వేటకు వెళ్లకుండా చూడాలని సూచించామన్నారు. అనధికార పడవలు, గోదావరిలోకి వెళ్లనీయ వద్దని, వేట బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా చూడాలని మత్స్యశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అనుకోని విపత్కర పరిస్థితులు తలెత్తితే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులను సిద్ధం చేశామన్నారు. గోదావరి పరివాహక ఏటిగట్లను నిరంతరం పహారా ఉండాలాన్నారు. ఎక్కడైనా బలహీనత ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన పటిష్టతా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక బస్తాలు, సర్వే భాదులు, వెదురు తడికలు, తదితర సామాగ్రి, సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. షట్టర్లు, గేట్లు, అవుట్ ఫాల్ స్లూయిజ్లు వంటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిన చేయాలని, కన్జర్వెన్సీ అధికారులను ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్ ఆదేశించారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దారు ఎన్ఎస్ఎస్.ప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టరు కె.యశోద, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలోని కనకాయలంకలో నీట మునిగిన కాజ్ వే వరద ఉధృతిని పరిశీలించి, ప్రజలతో మాట్లాడి, అధికారులకు దిశానిర్దేశం చేసి, పెదలంక, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడి పాలెం లక్ష్మీపాలెం, తదితర గ్రామాలను ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, మండల అధికారులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య సోమవారం సుడిగాలి పర్యటనలు చేశారు. గ్రామాల్లో అధికారులతో కలిసి నడుచుకుంటూ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రస్తుత పరిస్థితులను వివరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అధికారులు, సిబ్బంది గ్రామాల్లోనే మాకాం వేశారని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా సహాయ చర్యలు తీసుకునుటకు సంసిద్ధులుగా ఉన్నారని ప్రజలకు ఆయన తెలిపారు. మన జిల్లాకు వర్షం తగ్గినా, ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాల వల్ల మనకు వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. లంక గ్రామాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, పడవ ప్రయాణం చేయొద్దని ఆయన కోరారు. లంక గ్రామాల ప్రజలు వరద ఉధృతి తక్కువగా ఉన్నప్పుడే సురక్షిత ప్రాంతాలకు రావాలని, వరద ప్రభావం ఎక్కువైతే సురక్షిత ప్రాంతాలకు తీసుకు వచ్చుటకు చాలా ఇబ్బంది కలుగుతుందని లంకవాసులు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ లంక ప్రాంతాలకు ఆర్‌డిఒ, మండల అధికారులు పర్యటించి ఎప్పటికప్పుడు ఇక్కడ పరిస్థితులను అప్డేట్ చేస్తున్నారని ఆయన తెలిపారు. వరద పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మూడు నెలలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు నిల్వ ఉంచడం జరిగిందన్నారు. లంక గ్రామవాసులు పునరావాస, సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, పశుసంవర్ధక, మత్స్య, అగ్నిమాపక దళ, విద్యుత్తు, పంచాయతీ రాజ్ తదితర శాఖలు సహాయ చర్యలకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంతో అవసరమైతే గాని బయటికి రావద్దని, పరిస్థితి చేయిదాటితే అందరు తప్పనిసరిగా పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు. అవసరాన్ని బట్టి సహాయక కార్యక్రమంలో పాల్గొన్న వారికి లైఫ్ జాకెట్లు తప్పనిసరిగా ఇస్తామని జిల్లా జాయింటు కలెక్టరు సివి.ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. తహశీల్దారు సిహెచ్.విజయశ్రీ, ఎంపిడిఒ పి.శ్రీనివాసరావు, మండల వివిధ శాఖల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, మండల వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు.

నరసాపురం: ఏటిగుట్టను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఏటిగట్టును పరిశీలించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో పంటి రేవు, పొన్నపల్లి వద్ద వశిష్ట గోదావరి ఏటిగట్టును ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకర్ ఏటిగట్టు పొడవునా నడిచి, గట్టును పరిశీలిస్తూ, గట్టు నాణ్యతపై సందేహాలను ఏటిగట్టు పరిరక్షణ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో జరిగిన ఏటిగట్టు పనులను పరిశీలించారు. గోదావరి నీటి ప్రవాహన్ని చూసి వరద ప్రభావంపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల ఎగువ నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉందన్నారు. గోదావరికి వరద వచ్చే సూచనలు ఉన్నాయని, కావున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎంత పెద్ద వరద వచ్చినా తట్టుకునే విధంగా, ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని, కావున డయేరియా, కలరా వంటి అంటు వ్యాధులు సోకకుండా ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, బొమ్మిడి సూర్యకుమారి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న నాయకర్

తాళ్లకోడు కాలనీవాసుల ఆందోళన

దారి లేదు ఆదుకోవాలని కమిషనర్‌కు వినతి

కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న కాలనీవాసులు, సిపిఎం నాయకులు

ఆకివీడు: తమ కాలనీ మొత్తం మునిగిపోయిందని, తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తాళ్లకోడు 73 ఎకరాల నివాసితులు నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. కాలనీ ప్రాంతవాసులు నగర పంచాయతీ కార్యాలయం వద్ద కొద్దిసేపు నిరసన నినాదాలు చేశారు. సమస్యల ఏకరువు పెట్టారు. తమ ఆవేదనను కమిషనర్‌కు తెలియజేశారు. వెంటనే ముంపు ప్రాంతాన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్, ఎంఎల్ఎ, ఇతర అధికారులు వచ్చి మా సమస్యకు పరిష్కారం చూపించాలని కోరారు. తాగునీరు లేవని, రోడ్లు లేక రెండు రోజులుగా బయటకు వచ్చే మార్గం కరువైందన్నారు. వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. సిపిఎం కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇల్లు కట్టుకోమని ప్రోత్సహించి ఈరోజు నిలువునా ముంచారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినా సరే పట్టించుకోవటం లేదన్నారు. గతంలో స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించామన్నారు. ఫలితంగా తాళ్లకోడు కాలనీకి రూ.40 లక్షల రోడ్లకు నిధులు మంజూరయ్యాయని, వెంటనే రోడ్లు వేస్తామని చెప్పి హామీ ఇచ్చారని చెప్పారు. కానీ ఈనాటికీ కూడా ఏ అధికారి వచ్చి పరిశీలించలేదనీ, కనీసం రోడ్లు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. చిన్నపిల్లలు, ముసలి వాళ్లు ఎక్కువగా ఉండటం వల్ల బయటికి వెళ్లే పరిస్థితి లేదని, విష జ్వరాలు కూడా వస్తున్నాయన్నారు. స్పందించిన కమిషనర్ శానిటేషన్, మురుగునీరు బయటికి వెళ్లే దారిని వెంటనే చూపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సందక సూరిబాబు, బొడ్డుపల్లి రాంబాబు, గేదెల ధనుష్, డి.భారతి, పిసిని శ్రీదేవి, నీలం నాయుడు, పి.శ్రీను, పి.గంగా పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న ఓల్డ్ వయ్యేరు

ఆకివీడు : ఓల్డ్ వయ్యేరు పొంగిపొర్లుతోంది. వెంకయ్య కాలవలో నీటి ఒత్తిడి పెరగడంతో ఆ కాలువ పాయగా ఉన్న ఓల్డ్ వయ్యేరులో సైతం నీటి ప్రవాహం పెరిగింది. దీంతో చినగాపురం వద్ద విడిపోయిన ఈ కాలువ సరైన లాకుల నిర్మాణం లేకపోవడంతో యథేచ్ఛగా ప్రవహిస్తోంది. చినకాపవరం, అప్పారావుపేట మీదుగా ఆకివీడు వచ్చిన ఈ కాలువ కొల్లేరులోకి ప్రవహిస్తుంది. సుమారు 7 కిలోమీటర్లు ఉన్న ఈ కాలువ పొంగితే నాలుగు ఊళ్ల పంట పొలాలు, గ్రామాలు మునిగిపోతాయి. ఈ కాలువను అడ్డుకునే దారులు గాని, అవకాశాలు కానీ చాలా తక్కువ. ఉన్న అడ్డులు తొలగించడం ఒక్కటే మార్గం. ఆ పని ఎప్పుడో చేయాల్సిన అధికారులు నిద్రపోతున్నారు. ప్రజాప్రతినిధులు ఉన్న అడ్డాలు లేపారు. ఇది కాలవ పరిస్థితి ఎప్పుడు ఎవరిని ముంచుతుందో తెలియదు. ఆ కాలువ గట్టున ఆనుకుని ఉన్న సమతా నగర్‌ని పుచ్చలపల్లి సుందరయ్య నగర్ కాలనీ చెంచు వాసులు మాత్రం వానాకాలం ఎప్పుడూ మోకాలు నీటిలోనే కాపురం చేస్తారు. మరి ఈసారి ఏమవుతుందో చూడాలి. ఇక పంట పొలాలు మొత్తం మునిగిపోతాయి. రమారమి వెయ్యికరాలపైన నీట మునిగే ప్రమాదం ఉంది.

48 గ్రామాలకు వరద తాకిడి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన అధిక వర్షాలు, వరదలు కారణంగా ఏర్పడిన కొన్ని నష్టాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వివరించారు. ఏడు మండలాల్లోని 43 గ్రామాలు అధిక వర్షాలు, వరదలు తాకిడికి గురయ్యాయని అన్నారు. ఎనిమిది గ్రామాలలోనికి వరద నీరు చొచ్చుకు వచ్చిందని, మూడు పట్టణ ప్రాంతాలు కూడా వరద తాకిడికి గురికాగా, భీమవరం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో వరద నీరు చొచ్చుకు వచ్చిందన్నారు. 20 మండలాల్లోని 37 వేల 182 హెక్టార్లలో వరి నారుమళ్లు, వరినాట్లు దెబ్బ దెబ్బతిన్నాయని, దీని కారణంగా సుమారు రూ.4,152 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పంట నష్టానికి ఇన్పుట్ సబ్సిడీ రూ.4,151.74 లక్షలు అవసరం అన్నారు. అలాగే 614 మంది రైతులు సాగు చేస్తున్న ఉద్యానవన పంటలు 154.46 హెక్టార్లు నీటి ముంపుకు గురయ్యాయని, దీని కారణంగా సుమారు రూ.406 లక్షలు మేర నష్టం వాటిల్లుతుందని అంచనాగా తెలిపారు. ఉద్యానవన పంటలకు రూ.405.87 లక్షలు ఇన్పుట్ సబ్సిడీ అవసరం అన్నారు. వరద నీటి కారణంగా 14 గృహాలు దెబ్బతినగా, వాటిలో రెండు కచ్చా గృహాలు పూర్తిగానూ, ఒక కచ్చా గృహం తీవ్రంగానూ దెబ్బతిన్నాయని తెలిపారు. ఏడు గృహాలు పాక్షికంగానూ, నాలుగు గుడిసెలు దెబ్బతిన్నాయని వివరించారు. 161 కుటుంబాల్లోని 424 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజన ఏర్పాట్లు, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. 66 ఆర్ అండ్ బి రహదారులు దెబ్బతినగా వాటిలో 179.820 కిలోమీటర్ల మేర రోడ్లు ఉపరితలం దెబ్బతిన్నాయని తెలిపారు. రోడ్ల నిర్మాణాలకు తాత్కాలిక మరమ్మతులకు రూ.1,288.60 లక్షలు, శాశ్వత మరమ్మత్తులకు రూ.14,460 లక్షలు అంచనా వ్యయం ఖర్చు కాగలదని తెలిపారు. అలాగే 274.27 కిలోమీటర్ల పరిధిలోని 105 పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయని, వీటి తాత్కాలిక మరమ్మత్తులకు రూ.130 లక్షలు, శాశ్వత రోడ్ల ఏర్పాటుకు రూ.8,570 లక్షలు అంచనా వ్యయం అవుతుందన్నారు. వరద ముంపు ప్రాంతాల్లోని కుటుంబాలకు 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లను సరఫరా చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు.

వారికి ఆదాయపు పన్ను భారం మినహాయించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్

ప్రజాశక్తి - తణుకు

పదవీవిరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను భారం నుంచి మినహాయించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ పెన్షన్ ఆదాయంగా పరిగణించరాదని, దానిపై పన్ను విధించరాదని అన్నారు. వర్కింగ్ ఎంప్లాయిస్ వలే పెన్షనర్లకు ఎటువంటి ఎలవన్స్‌లు, ఇంక్రిమెంట్లు ఉండవని పేర్కొన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, వైద్య ఖర్చుల నిమిత్తం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతున్నాయని, అందువల్ల పెన్షనర్లను పన్ను నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని రాజగోపాల్ కోరారు.



బాధితులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న టిడిపి నేతలు

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటోంది

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వచ్చిన వరదల వల్ల నిరాశ్రయులైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని యనమదుర్రు కాలువకు ఆనుకుని ఉన్న ప్రాంతాలలో నీట మునిగిన ఇండ్లను ఆయన పరిశీలించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అరుంధతి పేటలో బాధితులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, జనసేన పట్టణ అధ్యక్షులు చెన్నమల్ల చంద్రశేఖర్, ముచ్చకర్ల సుబ్బారావు, ఎద్దు ఏసుపాదం, అనపర్తి కృష్ణప్రసాద్, గోపి, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, తోట సురేష్, పానకాల శ్రీను, చిన్న, సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఎంఎల్ఎ అంజిబాబు అధ్వర్యంలో ముంపు బాధితులందరికీ సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

టన్నెల్ పూడికతీత పనుల పర్యవేక్షణ

ప్రజాశక్తి - ఉండి

యండగండి టన్నెల్ పూడికతీత పనులను సోమవారం అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్, ఎండిఒ ఎస్.రవీంద్ర మాట్లాడుతూ గ్రామంలోని టన్నెల్ పూడుకుపోవడంతో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీరు రోడ్లపైకి చేరి జగనన్న కాలనీలోకి, తిమ్మరాజు కాలనీలోకి చేరిపోయిందని, దీనివల్ల నిరుపేదలు తమ ఇళ్లల్లోకి నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ దృష్టికి రాగానే సోమవారం టన్నెల్ పూడిక పనులను ప్రారంభించడం జరిగిందని, దీంతో కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంటుందని వారు తెలిపారు. యనమదుర్రు డ్రెయిన్ శాంతించడంతో పరిస్థితి సద్దుమణిగిందని ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదేశాల మేరకు డ్రెయిన్ గట్లను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన పంట కాలువ గట్లకు గండిపడటం వల్ల ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడటంతో పలు గేట్లను తెరవడం జరిగిందని వారు తెలిపారు. యండగండి పరిసర గ్రామాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో సహాయక చర్యలు తీసుకుంటున్నామని వారు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కాళీపట్నం పవన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని అయోధ్య లంక నదీ పరివాహక ప్రాంతంలో సోమవారం నుంచి గోదావరి వరద ఉధృతి పెరగడం వల్ల లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఐపీశెట్టి, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌లు తెలిపారు. అయోధ్య లంక పంచాయతీ పరిధిలో పెద్దపేట బిసి కాలనీ, మర్రి మూల, మానుకొండ వారి పేట, పుచ్చలంక నందు నేతలు వారి పేట, నక్కిడి లంక గ్రామాల్లో రేషన్ షాపులను పరిశీలించే స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు లంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి కడలి కృష్ణవేణి, విఆర్ఒ డిఎన్‌వి చలం, పంచాయతీ కార్యదర్శి సిహెచ్ పద్మశ్రీ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కాలువలోకి దిగిన వ్యక్తి గల్లంతు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ

గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు

యలమంచిలి: మండలంలోని యలమంచిలి లంక గ్రామానికి సమీపంలో ఉన్న నక్కల కాలువ రేవులో స్నానానికి దిగిన వ్యక్తి గల్లంతైన సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానిక విఆర్ఒ జెవి రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం యలమంచిలి లంక గ్రామానికి చెందిన పితాని ఆనందరావు(43) ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనోపాధిని పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో రోజూ మాదిరి తన పనులు ముగించుకుని స్థానిక నక్కల కాలువ రేవులో స్నానం చేయడానికి దిగారు. ఒకపక్క వర్షాలు, మరోపక్క వరద తాకిడితో వడివడిగా పోటెత్తి ప్రవహిస్తున్న నక్కల కాలువలో ఆయన ఒక్కసారిగా ప్రమాదవశాత్తు వడిలో కొట్టుకుపోయారు. ప్రమాద సంఘటన తెలుసుకున్న నరసాపురం ఆర్‌డిఒ ఎం.అచ్యుత్ అంబరీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గల్లంతయిన ఆనందరావు కోసం ఆర్‌డిఒ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆనందరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వరదొస్తే లంక గ్రామాల ప్రజలకు కష్టాలే..!

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెళ్లదీత

ప్రజాశక్తి - ఆచంట

అన్నదాతకు సిరుల పంట పండిస్తున్న గోదావరి వర్షాకాలంలో వరదగా మారి ఉగ్రరూపంతో వణికిస్తోంది. లంక గ్రామాల్లో వానాకాలం వస్తేనే ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచేస్తుందోనని ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకుని కాలం వెల్లదీస్తారు. ప్రస్తుతం ఇదే పరిస్థితిలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. ఆచంట మండలం లంక గ్రామాల్లో సుమారు 7 వేలమంది వరకూ నివసిస్తున్నారు. వీరిలో ఓటు హక్కు కలిగిన వారు సుమారు నాలుగు వేల మంది ఉన్నారు. కానీ గోదావరి వరదొస్తే వీరి కష్టాలు వర్ణతాతీతం. గోదావరి ఎగువన వర్షాలు భారీగా కురవడం, మరో పక్క గత వారం రోజులుగా అధిక వర్షాల వల్ల అధికారుల హెచ్చరికలతో వీరిలో మరింత ఆందోళన మొదలైంది. ప్రస్తుతం లంక గ్రామాల్లో కూరగాయ పంటలు చేతికి అందొచ్చాయి. మరోపక్క ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరికి వరద వస్తే అటు చేతికి వచ్చిన పంట ఒడ్డుకి చేరకపోగా, ఇటు నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరుగోరుమిల్లి వద్ద పూర్తిగా నిండిపోయిన పుష్కర ఘాటు

ప్రవాహం ఎక్కువైతే ప్రమాదమే..

గోదావరి నది పాయల నడుమ ఉన్న అయోధ్య లంక, పుచ్చలంక, మర్రిమూల, పల్లిపాలెం, ఆనగారలంక, పెదమల్లం లంక, వాసులో గ్రామం నుంచి బయట ప్రాంతానికి అడుగు పెట్టాలంటే పడవ ప్రయాణమే చేయవలసింది. అటు తూర్పునకు, ఇటు పశ్చిమకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. దీంతో వీరికి పడవ ప్రయాణం నిత్యకృత్యంగా మారింది. పండించిన పంటలు మొదలు అవసరమైన చిన్నపాటి వస్తువులను సైతం పడవలపైనే చేర వేసుకోవాలి. ఈ నేపథ్యంలో గోదావరి వరద తాకిడి తగిలి నీటి ప్రవాహం పెరిగితే మాత్రం పడవ ప్రయాణం ప్రమాదంతో కూడుకున్నదే. ప్రయాణించేందుకు నాటు పడవలు వినియోగిస్తుండడంతో ప్రమాద అవకాశాలు అధికంగా ఉంటాయి. దీని మూలంగా వరద సమయంలో ప్రయాణం చేయాలంటే భయపడిపోతుంటారు. వరద తాకిడి మరింత పెరిగితే పడవ ప్రయాణాలు కూడా పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో గ్రామంలో నిత్యవసర సరుకుల నుంచి అవసరమైన ప్రతి వస్తువు ధరలు కూడా భారీగా పెరిగిపోవడం పరిపాటిగా మారుతుంది.

విలువైన పంటలకు నష్టమే..

ప్రస్తుతం లంక భూముల్లో విలువైన పంటలు సాగవుతున్నాయి. వంగ, బిరా, బెండ, పచ్చిమిర్చి, తోటకూర, మునగా, తమలపాకు, మొక్కజొన్న, అరటి, తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వీటిలో ప్రస్తుతం పలు పంటలు చేతికి అందివచ్చి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం గోదావరి భారీగా వరద వస్తే మాత్రం పంట నష్టం తీవ్రంగా ఉంటుందని లంక రైతులు వాపోతున్నారు.

వారధి అందుబాటులోకి వస్తే..

గోదావరి నదిపైల నడుమ విస్తరించిన అయోధ్య లంక పంచాయతీ పరిధిలోని లంక గ్రామాలను అనుసంధానం చేస్తూ నిర్మించ తలపెట్టిన గోదావరి వారధికి భూమి పూజ జరిగి సుమారు 10 సంవత్సరాలు పూర్తిగా వచ్చింది. అయోధ్య లంక అభివృద్ధికి నాంది పలికే ఈ వారధి నిర్మాణంపై లంకవాసులు భారీ ఆశలు పెట్టుకున్నారు. వంతెన నిర్మాణం సహకారమైతే రవాణా మార్గం ఏర్పడడంతోపాటు లంక గ్రామాలకు మహర్దశ చేకూరుతుంది. ఈ నేపథ్యంలో 2014 ఫిబ్రవరిలో రూ.50 కోట్ల వ్యయంతో వారధి నిర్మాణానికి భూమి పూజ జరిగినా నేటికీ పునాదిరాయి పడకపోవడంతో లంకవాసులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ వారధి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే పడవ ప్రయాణ బాధలు పూర్తిగా తొలగిపోతాయి. వరద సమయంలో కూడా రవాణాకు ఎటువంటి ఆటంకాలు ఉండవని లంకవాసులు ఆశపడుతున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అయోధ్య లంక బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల గెలుపొందిన టిడిపి కూటమి ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ కూడా అయోధ్యలంక వారధి నిర్మాణం చేపడతామని ఎన్నికల హామీ ఇచ్చి గెలిపొందారు.

రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

రోటరీ క్లబ్ నరసాపురం (2024- 2025) నూతన కార్యవర్గం ఆదివారం రాత్రి వైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో జరిగింది. రోటరీ క్లబ్ అధ్యక్షురాలుగా గన్నబత్తుల సత్యవతి ప్రమాణ స్వీకారం చేశారు. సెక్రటరీగా బొమ్మిడి సూర్యకుమారి, ట్రెజరర్‌గా ఆత్మూరి రమ నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 3020 డాక్టర్ ఎం.వెంకటేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బాపుశ్రీ, జక్కం బాబ్జి, కోట్ల రామకుమార్, సిహెచ్.రెడ్డప్ప ధవేజి పాల్గొన్నారు.

ఎగదన్నుతున్న డ్రెయిన్లు..

కాళ్ల: గత తొమ్మిది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంకా ముసురు వీడలేదు. అల్పపీడనం ప్రభావంతో సోమవారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని డ్రెయిన్లు, పంట కాలువలకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు పంట కాలువల్లో నాచు, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు జరుగుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లో వరిసాగు చేసిన పొలాలు నీటమునిగాయి. ఇంకా రోజులు గడిచేకొద్దీ పంటలు పూర్తిగా దెబ్బతింటాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 4వేల ఎకరాల్లో ఖరీఫ్ వరిసాగు అవుతుందని అంచనాగా ఉంది. 72 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. వర్షాలకు 65 ఎకరాల నారుమళ్లు ముంపునకు గురై దెబ్బతింటున్నాయి. ఆకివీడు, ఉండి మండలాల్లో ప్రధాన డ్రెయిన్ల నీరు కాళ్ల మండలంలో నుంచి ఉప్పుటేరులోకి చేరుతోంది. ఈ మండలాలకు ఎగువ నుంచి వర్షపు నీటి ప్రవాహం అధికంగా వస్తుంది. దీంతో ఉప్పుటేరు, బొండాడ, అడ్డాలగ్రీకు, రుద్రయ్య కోడు, కోపల్లె మొగదిండి డ్రెయిన్లు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. దొడ్డనపూడి, కోలనపల్లి, కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు, సిసలి, జక్కరం గ్రామాల్లో వర్షపునీరు పొలాల నుంచి బయటకు వెళ్లని స్థితి. ఈ డ్రెయిన్‌లలో జమ్ము, తూటుకాడ, గుర్రపుడెక్క, కిక్కిస పేరుకుపోవడంతో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపునీరు దిగువకు పోవడం లేదు. ఇప్పటికే నీటమునిగిన వరిపైరు మరో నాలుగు రోజులపాటు నీటిలో ఉంటే కుళ్లిపోతుందనే భయం రైతులను వెంటాడుతోంది. అన్ని ప్రధాన పంటకాలువలు, డ్రెయిన్‌లను పరిశీలించి అవసరమైనచోట పూడికతీత పనులు వెంటనే చేయించాలని రైతులు కోరుతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొండాడ మేజర్ డ్రెయిన్

నిరాశ్రయుల పట్ల సేవాభావంతో మెలగాలి

ప్రజాశక్తి - ఉండి

నిరాశ్రయుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఉండి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాళ్లకూరి రత్నం అనే మహిళకు తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్య అవసర వస్తువులు, రూ.3 వేల నగదు అందివ్వడం జరిగిందని అన్నారు. సమాజంలో ఎంతోమంది దానగుణం కలిగిన వారు ఉన్నారని, ఇటువంటి వారిని గుర్తించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గుండాబత్తుల సుబ్బారావు, అళగిరి ఆనంద్, రాయి సతీష్, ఏడిద నెహ్రూ, దాసరి వరదరాజు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

మాజీ డిప్యూటీ సిఎం కొట్టు డిమాండ్

తాడేపల్లిగూడెం: గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ, విత్తనాలు తక్షణమే ప్రభుత్వం అందజేయాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పెంటపాడు మండలంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. నీట మునిగిన వరి పొలాలను, వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్ర కాలువ, వయ్యేరు, యనమదుర్రు కాలవలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పెంటపాడు మండలంలోని గ్రామాలైన దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల, రావిపాడు, బి.కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రపురం, ఆకుతీగపాడు, పరిమళ్ల, యానాలపల్లి గ్రామాల్లో మాజీ మంత్రి కొట్టు పర్యటన సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10-12 రోజులుగా వర్షాలు కురుస్తూ, వారం రోజులుగా వరద నీరు ప్రవహిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని ఖండించారు. ప్రజా ప్రతినిధులు తూతూ మంత్రంగా మొక్కుబడి పర్యటనలు చేస్తే సరిపోదన్నారు. తమ ప్రభుత్వంలో ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకునేవారమని పేర్కొన్నారు. ఇంతవరకు కనీసం వ్యవసాయ, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్తు, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు ముంపు గ్రామాల్లోకి వచ్చి పరిశీలించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ముంపు గ్రామాల్లోని అధికారుల బందాలతో శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరద నీటి ప్రవాహంతో గ్రామాల్లో జల వనరులు కలుషితమై ప్రజలకు కనీసం తాగడానికి సురక్షితమైన మంచినీళ్లు కూడా దొరకని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది ఎకరాల్లో సార్వా వరినాట్లు, నారుమడులు వరద నీటిలో మునిగి నాని కుళ్లిపోతున్నాయన్నారు. ఎకరానికి రూ.15 నుంచి 20 వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టి ఉన్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అధికారుల బృందాలతో ఎన్యుమరేషన్ చేయించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. వరద నీరు లాగిన అనంతరం రైతులు మళ్లీ సార్వా సాగు చేసుకోవడానికి విత్తనాలు, నారు ఉచితంగా ఇవ్వాలని కోరారు. నాట్లు వేసి నష్టపోయిన రైతాంగానికి ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పొంగిపొర్లుతున్న గోస్తనీ కాలువ

నీటమునిగిన పల్లపు ప్రాంతాలు

ప్రజాశక్తి - తణుకు

వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోస్తానీ కాలువ పొంగి పల్లపు ప్రాంతాలు నీట మునిగాయని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ తెలిపింది. వేల్పూరులోని స్థానిక శాలిపేట గణపతి నగరు శివారు నీట మునిగిన ప్రాంతాన్ని సిపిఎం బృందం సోమవారం పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు మాట్లాడుతూ గతంలో లాకుల వద్ద నుంచి రేలంగి వంతెన సమీపంలో ఉన్న గంగమ్మ గుడి వరకూ గత 30 సంవత్సరాలకు పైగా ఆధునీకరణ పనులు చేపట్టకపోవడం వల్ల గోస్తానీ కాలువలో తూడు, గుర్రపు డెక్క వంటి చెత్త చెదారం పెరిగి పోయి ప్రతీసారి కురిసిన వర్షాలకు ఈ ప్రాంతం నీట మునిగిపోవడంతో నీరు వెళ్లే డ్రెయినేజీ మార్గం లేక మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసనతో పాటు దోమలు విపరీతంగా పుట్టుకొస్తున్నాయన్నారు. దీంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ఎక్కడ వ్యాపిస్తాయోనని ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ, మంచినీటి కుళాయిలు వంటి మౌళిక వసతులు కల్పించి ఆ ప్రాంతంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వీరభద్రరావు డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఎటువంటి వ్యాధులు వ్యాపించకుండా ముందస్తుగా చర్యలు చేపట్టి తక్షణం బ్లీచింగ్ చల్లించే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, కుడక వీరభద్రరావు, పీతాని మదన్‌మోహన్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీట మునిగిన ప్రాంతాలను పరిశీలిస్తున్న నాకయకులు

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా కలెక్టర్ నాగరాణి

భద్రాచలంలో నీటిమట్టం పెరిగిందని, దీంతో రెండవ ప్రమాద హెచ్చరిక జారీ కావడం జరిగిందని, ఈ నేపథ్యంలో గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై గోదావరి వరద పరిస్థితిపై సమీక్షించారు. భద్రాచలం నుంచి దిగువకు వదులుతున్న వరద నీటితో వశిష్ట గోదావరి నీటిమట్టం గంట గంటకూ పెరుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్యం, అగ్నిమాపక శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ముందస్తు చర్యలను యుద్ధ ప్రాతిపతిపదికన పూర్తి చేయాలన్నారు. ప్రాణ, ఆస్తి, జంతు నష్టాలు ఎట్టి పరిస్థితుల్లో జరగకూడదని ఆదేశించారు. జల వనరుల శాఖ అధికారులు గోదావరి వరద పోటు సాధారణ స్థాయికి వచ్చేవరకు నిరంతర పర్యవేక్షణ, ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి గట్లు బలహీనంగా ఉన్నచోట ముందే చర్యలు చేపట్టాలని, గట్లు పరిస్థితిని తనిఖీ చేసి అవసరమైన ఇసుక బస్తాలు, తడికలు, వెదురు బొంగులు, జెసిబిలు వాటిని ముందుగానే అన్ని పాయింట్లులో సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యుత్ వైర్లు వేలాడడం కారణంగా ఒక్క ప్రాణికి హాని కలిగినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా అవసరమైన సామాగ్రిని ముందుగానే సమకూర్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలని విద్యుత్ శాఖ అధికారిని ఆదేశించారు. అవసరమైన బోట్లు, గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు ను ముఖ్యమైన పాయింట్లులో సిద్ధంగా ఉంచాలని జిల్లా అగ్నిమాపక అధికారిని ఆదేశించారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న నారుమళ్లు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అలాగే ఉద్యానవన పంటలు ఏమైనా దెబ్బతిన్నాయా అని ఆ శాఖ అధికారిని ప్రశ్నించగా ప్రస్తుతానికి నీటి ముంపులో మాత్రమే ఉన్నాయని బదులిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ ఇఇ దక్షిణామూర్తి, విద్యుత్ శాఖ ఇఇ పి.అహ్మద్ ఖాన్, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంపులోనే వరినాట్లు

ప్రజాశక్తి - ఆచంట

సార్వాసాగుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. గత ఏడాది సార్వ, దాల్వా రెండు పంటలను రైతులు వర్షాల కారణంగా అంతంత మాత్రమే దిగుబడి సాధించిన నేపథ్యంలో సార్వాపనులు ప్రారంభంలోనే రైతును వర్షుడు కోలుకోలేని దెబ్బతీశాడు. అల్పపీడన ప్రభావంతో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా పడుతున్న భారీ వర్షాలతో కలవర పడుతున్నారు. మండలంలో 10 వేల 200 ఎకరాల్లో సార్వసాగు చేపట్టిన రైతులు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే ఎకరాకు రూ.10 నుంచి రూ.12 వేల వరకు పెట్టుబడులు పెట్టి అయోమయంలో పడ్డారు. గత 5 రోజుల నుంచి వరిచేలు ముంపులోనే ఉండటంతో కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. మరో రెండు రోజులు ఇలాగే ఉంటే కనీసం పెట్టుబడులు కూడా రావని, అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి కూడా కనికరించడం లేదని లబోదిబోమంటున్నారు. మండలంలో నక్కల, తాడేరు, కొఠాలపర్రు, వల్లూరు డ్రెయిన్‌లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుంది. దీంతో డ్రెయిన్లు బిగదన్నాయి. డ్రెయిన్ల ఉధృతి నేపథ్యంలో మరో రెండు మూడు రోజుల వరకు చేలల్లో నీరులాగే పరిస్థితులు కనిపించడం లేదని, ఇలాగైతే సార్వాపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకోకపోతే భవిష్యత్తులో వ్యవసాయం చేయలేమని వాపోతున్నారు.

పెనుమంట్ర : స్థానికంగా వర్షం తగ్గుముఖం పట్టినా ఎగువున కురుస్తున్న వర్షాలకు డ్రెయిన్‌లలోకి వచ్చి పడుతున్న నీటి ప్రవాహం వల్ల పలు గ్రామాల్లోని పొలాల్లో ముంపు కొనసాగుతోంది. చాలా గ్రామాల్లోని పొలాల్లోకి చేరిన నీరు ప్రధాన కాల్వలతో పాటు, పిల్ల కాల్వల నిండుగా నీరు ఉండడం వల్ల ఎక్కడ ముంపు అక్కడే ఉంది. నాట్లు పూర్తి అయిన పొలాల్లో నీరు లాగకపోతే నాటిన వరి మొక్కలు కుళ్లి పాడయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆచంటలో ముంపులోనే ఉన్న వరినాట్లు

పూటుగా కాల్వల్లో నీటి ప్రవాహం : గోస్తనీ, జి అండ్ వి, రాపాక కాల్వలతో పాటు, గొంతేరు, భగ్గేశ్వరం, నరసాపురం తదితర కాల్వల్లో ప్రవహించే నీరు పూటుగా సాగుతూ భయాందోళనలు కలిగిస్తుందని రైతులు వాపోయారు. ఇరుగట్లు ఒరుసు కుంటూ నీటి ప్రవాహం ఉండడం వల్ల ఎక్కడైనా గట్లు తెగే ప్రమాదం ఉందని, సంబంధిత అధికారులు కాల్వాల గట్లు పర్యవేక్షణ చేయాలని పలు ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

ఘనంగా మున్సిపల్ మాజీ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తణుకు

తణుకు మాజీ మున్సిపల్ ఛైర్మెన్ పరిమి వెంకటేశ్వరరావు(వెంకన్నబాబు) జన్మదిన వేడుకలను సోమవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ టిడిపిలో(1991)లో పట్టణ తెలుగు యువత అధ్యక్షులుగా పదవి చేపట్టి పార్టీని బలోపేతం చేస్తూ, మాజీ మున్సిపల్ ఛైర్మెన్‌గా తణుకు పట్టణానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల కార్యవర్గ ఎన్నికకు నామినేషన్ల దాఖలు

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 31వ తేదీన జరగనున్న నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మొత్తం 28 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసారని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లమిల్లి జోసెఫ్ తెలిపారు. మొత్తం 15 మందితో కూడిన న్యాయవాదుల సంఘం కార్యవర్గానికి మొత్తం 28 నామినేషన్ పత్రాలు దాఖలయ్యాన్నారు. అధ్యక్ష పదవికి సిహెచ్ఎస్ఆర్ఆర్ మోహన బాలాజీ, జిఎం.వల్లభరావు, ఉపాధ్యక్ష పదవికి కొత్తపల్లి రమేష్, కె.సుందర మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి పదవికి వైదాని నాగేశ్వరరావు, రంపా పుల్లాజీ, ఆర్.గ్లాడ్ సన్ కుమార్, కోశాధికారి పదవికి పూరిళ్ల శ్రీనివాస్, రంపా పుల్లాజీ, లైబ్రరీ కార్యదర్శి పదవికి కె.అమరేశ్వరరావు, రంపా పుల్లాజీ, నారిన శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పదవికి కురెళ్ల సోమశేఖర్, నారిన శ్రీనివాసరావు, క్రీడలు-సాంస్కృతిక కార్యదర్శి పదవికి మేడిది శ్రీమంత్, కెసిహెచ్.పద్మజ, మహిళా ప్రతినిధి పదవికి రొక్కాల జెస్సికళ, బొడ్డు ప్రగతి, కార్యవర్గ సభ్యుల పదవులకు తంగెళ్ల వెంకటేశ్వరరావు, ఓసూరి జ్యోతి మాంగళ్య(30 సంవత్సరాల ప్రాక్టీసు), తోట రాజ్య సూర్యలక్ష్మి, కె.చంద్ర శేఖర్(20 సంవత్సరాల ప్రాక్టీసు), కుంచే దుర్గాభవాని(10సంవత్సరాల ప్రాక్టీసు) కె.అన్నపూర్ణ, కెఎల్ఎస్ఎస్ నాగశిరీష, గోపిరెడ్డి మణి, పులపర్తి హర్షవర్ధన్, ఎం.కాశీనాథ్‌లు నామినేషన్ పత్రాలను దాఖలు చేసారని ఆయన వివరించారు. అభ్యర్థులు ఈనెల 24, 25వ తేదీల్లో తమ నామినేషన్‌లను ఉపసంహరించుకోవడానికి గడువు ఉందని, ఎన్నికలను ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని జోసెఫ్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన పలువురు కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు సోమవారం పరామర్శించారు. మొగల్తూరులోని హైస్కూలు వీధిలో ముక్కు ఓం మేడిచర్ల రాజులను ఆయన పరామర్శించారు. ముక్కు ఆంజనేయులు, మేడిచర్ల రవితేజ ఇటీవల మృతి చెందారు. అనంతరం వారిని పరామర్శించారు. అనంతరం మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో ముచ్చర్ల దుర్గారావు, కురెళ్ల బేబీ సరోజిని, చినిమిల్లి వెంకన్న ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బస్వాని ఏడుకొండలు, దేశంశెట్టి శ్రీను, ముక్కు పుల్లయ్య, బాలు, లక్కు బాలాజీ ఉన్నారు.

'గోస్తనీ పూడిక గత ప్రభుత్వ తప్పిదమే'

ప్రజాశక్తి - పెనుమంట్ర

గత ప్రభుత్వం గోస్తానీ నది పూడిక గురించి పూర్తిగా విస్మరించడం వల్లనే ఇప్పుడు వరదల వల్ల ముంపు బారిన పడిందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట గంగరాజు విమర్శించారు. సోమవారం మండలంలోని ఎస్.ఇల్లిందలపర్రు గ్రామంలో వరద ముంపు ప్రాంతాలను కిసాన్ మోర్చా బృందం సందర్శించి, రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సందర్శనలో జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పులపర్తి నాగరాజు, అత్తిలి మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు సరగడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొట్టుకొస్తున్న కళేబరాలు

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్ సముద్రతీరానికి పశువుల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. గోదావరికి వరద ఉధృతి ఎక్కువ ఉండడంతో ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహానికి మృతి చెందిన పశువుల కళేబరాలు గత రెండు రోజులుగా కొట్టుకు వస్తున్నాయని స్థానికులు తెలిపారు.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE ICHAPURAM.
O.S. 10/2016.

Between:
Naidu Tulasi and 2 others. ...Plaintiffs.
And:
Naidu Eswaramma & 8 others. ...Defendants.

NOTICE TO THE RESPONDENT/DEFENDANT No. 8 UNDER ORDER 5 RULE 20 C.P.C.

To,
Defendant No. 8:
Naidu @ Regu Revathi Madhuri, W/o Regu Venkata Ravi Kumar, D/o Late Naidu Nagaraju, R/o Door No. 13-30, Sanivarampeta, Eluru.

Please take notice that the plaintiff has filed the above suit against you and another for permanent injunction and the same is posted to **31-07-2024** for your appearance **at 10-30 A.M.** in the Hon'ble Court of the Junior Civil Judge, Ichapuram and you are to appear in person or through Advocate, failing which the matter will be decided in your absence.

// BY ORDER //

MONOJ KUMAR SAMONTO
ADVOCATE,
ICHAPURAM, SRIKAKULAM,
CELL.No: 8639689012.

Ichapuram,
Dated: 22-07-2024.